
ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 25 | సంచిక : 3 | నవంబరు 2019

## స్వరూపమే శాంతి

వాస్తవంగా 'తాను' ఎవరో? 'నేను' ఎవరో? ఎరుక లేకుండానే, అనగా స్వరూప ఎరుక లేకుండానే, మన జీవితాలు యాంత్రికంగా సాగిపోతున్నాయి. ఏదో సాధించాలి, ఎక్కడికో వెళ్ళి, ఏదో పొందాలి అని ఆరాటపడతాం. దానికి కారణం ఇప్పుడు మనము ఉన్న స్థితిలో, అనగా ఈ వర్తమానములో పరమాత్మ మనకు ప్రసాదించిన వాటి పట్ల తృప్తి లేని కారణముగా, దానికి భిన్నముగా ఏదో కావాలని కోరుకుంటాం! శరీరానికి మంచి ఆరోగ్యం, సంపద, కీర్తి, పదవి మున్నగునవి కోరుకుంటూ, భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటాం. ఈ రోజుకన్నా రేపు బాగుండాలని కోరుకుంటాం! ఒక వస్తువును మనము కోరుకొనేది ఆ వస్తువు గురించి కాదు, మన అహంకారాన్ని సంతృప్తి పరచుకొనుట కొరకే ఆ వస్తువును కోరుకుంటాం! భగవాన్ శ్రీరమణమహర్షి నీ స్వరూపమే శాంతి, నీ స్వరూపమే సుఖము అని బోధించినప్పటికీ, శాంతిని, సుఖాన్ని బాహ్యములోనే వెదుకుతున్నాం! నిజమైన శాంతి, సుఖము మన స్వరూపముకన్నా భిన్నముగా దేశ కాలములలోనూ, భవిష్యత్తులోనూ లేదు. ఆనందాన్ని తన స్వరూపం కన్నా భిన్నముగా బాహ్యంలో వెదకడం వల్ల, అది ఎప్పటికీ ఎండమావిలో నీరు మాదిరే అవుతుంది. ఒక్క చైతన్యము తప్ప దానికి భిన్నముగా భావింపబడేవన్నీ మార్పుకిలోనయ్యేవే! మార్పుకు లోనయ్యే దృశ్యపదార్థములనుండి శాశ్వతమైన శాంతి ఎన్నటికీ లభించదు. ఏదైనా వెదుకుతున్నాము అంటే దానిని మనము పోగొట్టుకున్నట్లు

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

21-12-2007, అత్తిలి
అరుణాచల మహత్మ్యం
శ్రీమద్భగవద్గీత

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

భావిస్తున్నామని అర్థం. ఒక స్త్రీ తన మెడలో ధరించిన హారాన్ని అది ఉన్నట్లు మరచి, బయట అంతా వెదకి, చివరికి అది తన మెడలోనే ఉన్నట్లు గ్రహించిన విధముగా; మనము వెదికే శాంతి, ఆనందము మన స్వరూపంగానే ఉంది. "నీవు వెదికేది నీ కోరకే, నీ స్వరూపమే శాంతి, ఉన్నదంతా లోపలే ఉంది, బయట ఏమీ లేదు" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి.

ఓం తత్ సత్

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**మీ చందా గడువు ముగిసినది.**

**కావున చందాను పునరుద్ధరించుకోగలరు.**

భక్తుల కోరికపై సద్గురువు శ్రీ నాన్నగారి భోదామృతం ఇంకా వివరంగా అందివ్వాలనే ఉద్దేశంతో **రమణభాస్కర** మాసపత్రిక సెప్టెంబరు సంచిక నుండి మార్పులు చేయబడినది. దీనికి భక్తుల నుండి సలహాలు, సూచనలు ఆహ్వానిస్తున్నాము. పత్రికకు సంవత్సర చందా కట్టడంలో భక్తులు ఇబ్బందులు చెపుతున్నందు వలన ఇప్పటినుండి **శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లుగా నిర్ణయించడమైనది. భక్తులందరూ ఈ అవకాశమును ఉపయోగించుకొని రమణభాస్కర మాస పత్రికకు శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**శాశ్వత చందా** (10 సం॥లకు) రు॥ **1200**/-లు

**సంవత్సర చందా** రు॥ **150**/-లు

## ముఖ్య గమనిక

రమణ భాస్కర పత్రిక ప్రతీ నెల 5వ తేదీన పోస్టు చేయటం జరుగుతోంది. పత్రిక 12వ తేదీలోపు మీకు అందని యెడల ఈ క్రింది సెల్ నెంబరుకు ఫోన్ చేసి మీ రశీదు నెంబరు తెలియబరచిన యెడల పత్రిక మరల పోస్టు చేయబడును. కావున భక్తులు గమనించగలరు.

సెల్ : **8883147999**



ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 21 డిసెంబరు 2007, అత్తిలి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం ప్రాంగణంలో ఈ సభ ఏర్పాటు చేసిన ఇక్కడి కమిటీ సభ్యులకు, సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం కేంద్రంగా పెట్టుకొని సత్కర్మ నిష్కామంగా చేస్తున్నందుకు మనందరి తరపున వందనములు సమర్పించుకొంటున్నాను. నేను కొమ్మరలో 3వ తరగతి చదువుతున్నప్పుడు ఈ ఆలయానికి వచ్చి దర్శనం చేసుకున్నాము. మా అమ్మమ్మగారు రెండుఎడ్ల బండి మీద తీసుకువచ్చి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని చూపించారు. ఆ రోజు చాలా ఎక్కువ మంది జనం ఉన్నారు. అది బాగా గుర్తు వస్తోంది అన్నారు నాన్నగారు.

స్వామి అంటే సొత్తు కలవాడు, స్వామి అనే మాట ఎక్కువ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వర్తిస్తుంది. కృష్ణుడికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భేదం లేదు. అహం స్కందః -- నేను స్కంద రూపములో ఉన్నాను. రాముడి రూపంలో, శంకరుడి రూపంలో, కుమారస్వామి రూపంలో ఉన్న వాడిని నేనే, అని భగవద్గీతలో విభూతియోగంలో చెప్పాడు. విభూతి అంటే ఐశ్వర్యం, నా ఐశ్వర్యం శంకరుడిలో ఉంది, కుమారస్వామిలో ఉంది. ఉపాసన చేసుకోవటానికి, వర్షిప్ చేసుకొని వాళ్ళ అనుగ్రహం సంపాదించి తరించటానికి ఈ రూపాలని భగవంతుడు చెప్పాడు.

సనత్కుమారుడుతో నారదుడు ఏమన్నాడు అంటే నాకు చదువులు అన్నీ అయిపోయినవి, నాకు చేతకాని విద్య అంటూ లేదు, నేను 64 విద్యలలో పండితుడిని అయినా దుఃఖం ఆగటం లేదు అన్నాడు. నాకు పాండిత్యంలో లోటు లేదు, ధనంలో లోటు

లేదు, గౌరవం ఉంది. ఎక్కడికి వెళ్ళినా నన్ను ఆహ్వానిస్తారు. కాని అశాంతి వస్తోంది, దుఃఖం వస్తోంది. ఎందుచేత అశాంతి నుంచి బయట పడలేక పోతున్నాను? నాకు ఏదైనా మార్గం చూపించు అని నారదుడు సనత్కుమారుడిని అడిగాడు. అప్పుడు సనత్కుమారుడు నారదుడికి చెప్పాడు, నీవు అన్ని విద్యలు నేర్చుకున్నావు. ఏ విద్య నేర్చుకుంటే దుఃఖం మూలంతో సహా నశిస్తుందో అది నేర్చుకోలేదు అన్నాడు. ఎక్కడైతే అశాంతి లేదో, ఎక్కడైతే దుఃఖము లేదో, ఆ స్థానము నీకు తెలియలేదు. ఎక్కడ దుఃఖము లేదో, ఎక్కడ అశాంతి లేదో, ఎక్కడ క్షోభ లేదో, ఆ వస్తువు నీకు తెలియబడలేదు. ఎక్కడ సుఖ స్వరూపం ఉందో, ఎక్కడ శాంతి స్వరూపం ఉందో, అది తప్పించి మిగతావి అన్నీ నేర్చుకున్నావు. అవి నేర్చుకున్నా ప్రయోజనం లేదు. నీవు నేర్చుకున్నవి ఊరికే సన్మానాలకి, గౌరవాలకి ఉపయోగపడతాయి అని చెప్పి తరువాత సనత్కుమారుడు నారదుడికి ఆత్మవిద్య బోధించాడు. ఆయన బోధలో ఆత్మజ్ఞానం తప్పించి, ఆత్మవైభవం తప్పించి, శుద్ధచైతన్యం గురించి తప్పించి ఇంకేమీ ఉండదు.

మనం ప్రపంచాన్ని చూస్తున్నాము కానీ ప్రపంచానికి ఆధారంగా ఉన్న చైతన్యాన్ని చూడలేకపోతున్నాము. మన హృదయంలో ఉన్నటువంటి చైతన్యాన్ని చూడలేకపోతున్నాము. ఏది ఉండటం వలన ఈ సృష్టి అంతా మనకి కనిపిస్తోందో దాన్ని దర్శించలేక పోతున్నాము. చైతన్యం రూపరహితం, నామరహితం, క్రియారహితం. అందుకని అది మన బుద్ధికి అందటం లేదు. అందుచేత ఆత్మవిద్యని నారదుడికి బోధించి, ఆ విద్యని నువ్వు శ్రద్ధగా విని గుండెకి పట్టించుకో, అప్పుడు దుఃఖస్పర్శ లేని స్థితిని పొందుతావు. అది ఆత్మజ్ఞానం, ఆత్మవిద్య. దీనినే బ్రహ్మవిద్య అంటారు. మిగతా విద్యలు నేర్చుకున్నా, అవన్నీ పొట్టకే పరిమితం, దేహానికే పరిమితం; ఒక్క బ్రహ్మవిద్య మట్టుకే బ్రహ్మజ్ఞానాన్ని తెలియచేస్తుంది. బ్రాహ్మీస్థితికి తీసుకువెళ్తుంది, బ్రహ్మనిష్ఠ నేర్పుతుంది. ఒక్క బ్రహ్మంలో తప్పించి ఎక్కడా సుఖం లేదు. బ్రహ్మం ఒక్కటే శాశ్వతమైనది. బ్రహ్మం ఒక్కటే స్వయముగా ఉండగలదు. బ్రహ్మంను విడిచి ఎక్కడికి వెళ్ళినా అశాంతే.

అక్కడ సనత్కుమారుడే ఇక్కడ సుబ్రహ్మణ్యుడిగా వచ్చాడు. తారకాసురుడు అనే రాక్షసుడు ఉండేవాడు. వాడిని ఎవరూ చంపలేకపోతున్నారు. శివుడికి కనుక ఒక కుమారుడు జన్మిస్తే వాడు తారకాసురుడిని సంహరించగలడు. మిగతావాళ్ళ ఎవ్వరి వలన సాధ్యం కాదని చెప్పారు. అప్పుడు దేవతలు శివుడిని ప్రార్థించారు. తారకాసురుడి సంహారం కోసం నీ ప్రతిరూపం కావాలి అన్నారు. సుబ్రహ్మణ్యుడు అంటే శివుడి యొక్క అవతారం. శివుడి యొక్క

మానిఫెస్టేషన్ సుబ్రహ్మణ్యుడు. తారకాసురుడిని సంహరించగల శక్తి సనత్కుమారుడికి ఒక్కడికే ఉంది. అది గ్రహించి, శివుడు సనత్కుమారుడిని భూమి మీదకి తీసుకు రావటానికి సనత్కుమారుడి దగ్గరికి వెళ్ళాడు. వాడిని భూమి మీదకి తీసుకురావటానికి ఏదో ఆకర్షణ చూపించాలని, నువ్వు ఏమైనా కోరికలు కోరుకో అన్నాడు.

సనత్కుమారుడికి ఏమీ అక్కరలేదు. వాడు బాడీ లెస్, మైండ్ లెస్, వరల్డ్ లెస్. అహంవృత్తి ఎలా ఉంటుందో తెలియని వాడు. దేహం, ప్రాణము, మనస్సు, బుద్ధి, వీటితోటి సంబంధము లేని వాడు. కేవలం బ్రహ్మ స్వరూపుడు. నాలుగు వేదములు పిండితే, ఏ పరబ్రహ్మము తెలుసుకోమని చెప్పాయో, ఆ పరబ్రహ్మము అయి ఉన్నవాడు సనత్కుమారుడు. సనత్కుమారుడికి చావు పుట్టుకల తోటి సంబంధము లేదు, ఆయన సృష్టిలో ఒక భాగము కాదు. వాళ్ళు కారణజన్ములు. ఆ సనత్కుమారుడిని నువ్వు ఏవైనా కోరికలు కోరుకో అన్నాడు శివుడు.

అసలు మనకి కోరికల వలన, వాసనల వలన, ఈ ప్రపంచం నిజం కాకపోయినా నిజం కింద అనిపిస్తుంది. ఈ దేవాలయాల చుట్టూ తిరిగేవాళ్లకి, వాళ్ల కోరికలు నెరవేరటమే కావాలి కాని, ఆత్మజ్ఞానం ఎవరికీ అక్కరలేదు. ఏదో కోరిక పెట్టుకోవటం, ఆ కోరిక తీర్చుకోవటం. ఆ కోరిక తీర్చుకున్నాక నెరవేరిన కోరిక ఇంకో వంద కోరికలని తీసుకువస్తుంది అని మనకి తెలియదు. మనం కోరికలని నెరవేర్చుకోవటం మొదలుపెడితే, ముగింపు ఉండదు దానికి. కోరికలని నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేసేవాడికి సంతృప్తి ఎలా ఉంటుందో తెలియదు.


సిక్కుల మతగురువు ఒకాయన శీతాకాలంలో పొద్దునే లేచి సూర్యుడికి అభిముఖంగా కూర్చుని ధ్యానం చేసుకొంటున్నాడు. ఒక పెద్ద ధనవంతుడు వెళ్లి ఆయన ఎదురుగా నిలబడి ఏం కావాలో కోరుకో ఇస్తాను అన్నాడు. నువ్వు నాకు ఏమీ ఇవ్వక్కరలేదు. శీతాకాలం సూర్యుడి కిరణాలు నా శరీరం మీద పడతాయని ఇక్కడ కూర్చున్నాను. సూర్యుడికి నాకూ అడ్డుగా నిలబడ్డావు. అడ్డు తప్పుకుంటే సరిపోతుంది. నాకు ఏమీ ఇవ్వక్కరలేదు అన్నాడు. వాళ్లకి సృష్టి అంతా గడ్డిపరక కింద కనిపిస్తుంది. బ్రహ్మజ్ఞానికి సృష్టి అంతా గడ్డిపరక తోటి సమానం.

శివుడు సనత్కుమారుడిని నీవు ఏమైనా కోరికలు కోరుకో అన్నాడు. నువ్వు పెద్దవాడివి తిరస్కరించకూడదు. కాని నాకు అవసరం లేదు అన్నాడు. శివుడు మూడు

నాలుగు సార్లు అడిగాడు కోరికలు కోరుకోమని. వాడిని ప్రలోభ పెట్టి భూమి మీదకి తీసుకురావటానికి. అప్పుడు సనత్కుమారుడు ఏమన్నాడంటే, నన్ను కోరుకో అంటున్నారు, ఒక పని చెయ్యండి, నేనే మీకు ఇస్తాను, మీరే ఏమైనా కోరిక కోరుకోండి అన్నాడు. గ్రేట్ సన్ అఫ్ ఏ గ్రేట్ ఫాదర్! నేనే ఇస్తాను మీరు కోరుకోండి అన్నాడు సనత్కుమారుడు. అప్పుడు శివుడు వీడు దొరికాడు అనుకున్నాడు. ఏదో రకంగా వాడిని భూమి మీదకి తీసుకురావాలి తారకాసురుడి సంహారం కోసం. వాడి శక్తి ఒక్కటే తారకాసురుడిని చంపగలదు. దొరికాడు కదా, వాడే అడుగుతున్నాడు కదా అని, వెంటనే నా కుమారుడిగా జన్మించు అన్నాడు శివుడు. నీ కుమారుడిగా రావటానికి అభ్యంతరం లేదు, వస్తాను అయితే ఒక షరతు ఉంది. తల్లి కడుపులోంచి మట్టుకు రాను అన్నాడు.

అప్పడు శివుడు ఆలోచించి ఏం చేసాడంటే, తన మూడవ నేత్రం, జ్ఞాననేత్రం తెరిచాడు. అప్పడు సనత్కుమారుడు శివుడి యొక్క జ్ఞాననేత్రం లోంచి వచ్చాడు. కుమారస్వామి అంటే జ్ఞానాగ్ని. ఆరు ముఖాలతోటి వచ్చాడు. షణ్ముఖుడి పేరు ఇక్కడ ఎవరూ పెట్టుకోరు కానీ తమిళనాడులో పెట్టుకుంటారు. మనం సుబ్రహ్మణ్యుడు అంటాము వాళ్ళు మురుగా అంటారు. మురుగ అంటే బ్యూటిఫుల్ చైల్డ్. అందమైన బిడ్డ - శివుని కుమారుడు. పార్వతి కడుపున పుట్టలేదు కదా. దేవకన్యలు ఆరుగురు కలిసి పెంచితే, ఆరు ముఖాలు పెట్టుకుని ఆరుగురు తల్లుల పాలు తాగేవాడు. కాబట్టి షణ్ముఖుడు అన్నారు. తరువాత పార్వతి చేరదీసి, తన వడిలో కూర్చోపెట్టుకొని, ఆరు ముఖాలని ఒక ముఖం క్రింద ఐక్యం చేసింది. అప్పుడు స్కందుడు అనే పేరు వచ్చింది. కుమారస్వామి భూమి మీద పుట్టలేదు. కైలాసంలో శివుని కుమారుడుగా జన్మించాడు. ఇప్పుడు వాడిని భూమి మీదకి తీసుకురావాలి. శివుడి మూడో నేత్రం లోంచి వచ్చేసాడు. దేవకన్యలు పెంచారు. తరువాత శివుడు భూమి మీదకి తీసుకురావాలి.

శివుడికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు వినాయకుడు, రెండవవాడు సుబ్రహ్మణ్యుడు.



**మన గురి అంతా హృదయంలో ఉన్న సత్యం మీదే ఉండాలి. మనం మాట్లాడితే దాని కోసమే మాట్లాడాలి, పని చేస్తే దాని కోసమే పని చెయ్యాలి. నీ మనస్సును, ఇంద్రియాలను సత్యంమీదే కేంద్రీకరించు. ఆ రకంగా జీవిస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న చీకటి అంతా పోతుంది, సత్యం నీకు అనుభవంలోనికి వస్తుంది.**

సుబ్రహ్మణ్యుడు - బ్రహ్మణ్యుడు అంటే బ్రహ్మ స్వరూపము తెలిసినవాడు సుబ్రహ్మణ్యుడు. వన్ హూ నోస్ బ్రహ్మం వెరీ వెల్ ఈజ్ కాల్డ్ సుబ్రహ్మణ్య! బ్రహ్మ స్వరూపము గురించి వెలితి లేకుండా ఉన్నది ఉన్నట్టుగా సమగ్రంగా తెలిసిన వాడు సుబ్రహ్మణ్యుడు. అందుచేత ఆయన జ్ఞాన గురువు.

వీడిని భూమి మీదకి తీసుకు రావాలని పార్వతీ పరమేశ్వరుల దగ్గర వినాయకుడు స్కందుడు కూర్చుని ఉండగా, నారదుడు ఒక పండు పట్టుకుని వెళ్ళాడు. పోనీ రెండు పట్టుకెళ్ళవచ్చు కదా. పిల్లకాయల దగ్గరికి పేచీ కోసం పట్టుకెళ్ళాడు. నారదుడు మహర్షి, ఎవరికైనా పేచీలు పెడితే చెడ్డకి పేచీ పెట్టడు, మంచి జరగటానికి పేచీలు పెడతాడు. నారదుడు పట్టుకెళ్ళిన పండు వినాయకుడు నాకు కావాలి అన్నాడు. సుబ్రహ్మణ్యుడు నాకు కూడా కావాలి అన్నాడు. ఒక్కటే పండు, ఇద్దరిలో ఎవరికి ఇవ్వాలి. వినాయకుడు అమ్మ కొడుకు, స్కందుడు నాన్న కొడుకు. వీళ్ళు ఇద్దరు తల్లి గర్భలోంచి వచ్చిన వాళ్ళు కాదు. వినాయకుడిని బొమ్మ క్రింద తయారు చేసి ప్రాణం పోసింది పార్వతి. స్కందుడు శివుడి మూడో నేత్రంలోంచి వచ్చాడు. పండు నాకు కావాలి అంటే నాకు కావాలి అన్నారు. అప్పుడు శివుడు, మీరు ఇద్దరూ కలిసి ఈ భూమి చుట్టూ ప్రదక్షిణ చేసి రావాలి ఎవరైతే ముందు తిరిగి వస్తారో వాడికి ఈ పండు ఇస్తాను అన్నాడు.

సుబ్రహ్మణ్యుడు మయూర వాహనుడు. మయూరం స్పీడుగా వెళ్ళిపోతుంది. వినాయకుడు మూషిక వాహనుడు. ఈ పందెం చెప్పేసరికి వాడు మయూరం మీద స్పీడుగా వెళ్ళిపోయాడు. వినాయకుడు పందెం ఓడిపోవటం ఖాయం అనుకున్నాడు. ఎలుకని వాహనం చేసుకొని ఎంత దూరం వెళతాడు. ఏం చేసాడంటే, భూప్రదక్షిణం చెయ్యమన్నారు కదా, తల్లి తండ్రులు కూడా భూమితోటి సమానం. అయినా ఈ లోకాలన్నీ శివుని గర్భంలోనే ఉన్నాయి కదా అని, ఆయన ఎలుక మీద కూర్చొని తల్లితండ్రుల చుట్టూ తిరిగేసాడు వినాయకుడు. మొత్తం లోకాలు అన్నీ మీ కడుపులోనే ఉన్నాయి కదా. ఇంక ఆ లోకాలకి ఏముంది? పండు నాకు ఇచ్చేయండి అన్నాడు. వీడేమో కష్టపడి కష్టపడి భూమి అంతా చుట్టుకుని చుట్టుకుని వస్తే, అప్పటికే పండు వీడికి ఇచ్చేసారు. వీడు తినేస్తున్నాడు. సుబ్రహ్మణ్యుడికి కోపం వచ్చేసింది, ఇది అన్యాయం అని. వాడు తల్లితండ్రులు చుట్టూ తిరిగేసాడు, అదే భూప్రదిక్షణ అనుకుని వాడికి ఇచ్చేసాము అన్నారు. మీరు చెప్పే మాటలు న్యాయంగా లేవు, నేను భూలోకానికి వెళ్ళిపోతాను అంటాడు సుబ్రహ్మణ్యుడు. ఇది నారదుడి

పన్నాగం! ఆయనని భూమి మీదకి తీసుకురావటం కోసం వేసాడు ఈ ప్లాన్. ఒక పండే ఇచ్చి ఈ కోపాలు తెప్పించాడు.

అప్పడు శివుడు ఒక గొప్పమాట అన్నాడు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వైభవమంతా ఈ ఒక్క వాక్యం లోనే ఉంది. శివుడు అన్నాడు, ఆ పండు తింటే పోతుంది, నీకు ఎందుకు అది, నీవు జ్ఞానం అనే పండువి. వినాయకుడు తినే పండు నీకెందుకు, యు ఆర్ ఫ్రూట్ అఫ్ విజ్డం. ఈ మాట జ్ఞాపకం పెట్టుకోండి, నీవు జ్ఞానఫలానివి. నీకు ఆ పండు ఎందుకు ఇంక, అంటాడు. అయినా మీరు ఒక పద్ధతిగా చెప్పారు, ఇంకో పద్ధతిగా చేసారు, రాజీపడను అని కోపగించుకొని పళని వచ్చేసాడు. అది పళని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కథ.

పళనిలో ఆయనని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనరు, దండాయుధపాణి అంటారు. దండము ఆయుధముగా కలవాడు దండాయుధపాణి. పళనిలో ఆయన చేతిలో దండము ఉంటుంది. కోపము వచ్చి పళని వచ్చేసాడు. రమణమహర్షి గారి లాగ బట్టలు అవీ తీసేసాడు. ఒక గోచీ పెట్టుకున్నాడు. దండం పట్టుకున్నాడు. హి బికేమ్ సన్యాసి. నాకు ఇంకేమీ వద్దు అన్నాడు. సనత్కుమారుడు సుబ్రహ్మణ్యుడిగా వచ్చాడని, సుబ్రహ్మణ్యుడే రమణస్వామిగా వచ్చాడని ఒక సాంప్రదాయం.

ఇక్కడినుంచి ఆయన తిరుచందూరు వెళ్లారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రాలలో గొప్ప క్షేత్రం ఇది. అన్నీ గొప్ప క్షేత్రాలే అయినా, తిరుచందూరులో ఫుల్ మానిఫెస్టేషన్ అఫ్ సుబ్రహ్మణ్య! తిరుచందూరు కన్యాకుమారికి రెండు గంటల ప్రయాణం. సముద్రం వడ్డున ఉంది. సుబ్రహ్మణ్యుడి పూర్ణఅవతారం తిరుచందూరులో చూపించాడు. ఆ తిరుచందూరులోనే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తారకాసురుడిని సంహారం చేసాడు. మీరు తిరుచందూరు వెళ్లినప్పుడు చూడండి, సముద్రంలో మిగతా నీరు అంతా ఒక రకంగా ఉంటుంది. తిరుచందూరులో ఉన్న సముద్రపు నీరు రంగు వేరుగా ఉంటుంది. ఎక్కడ తారకాసురుడిని సంహారం చేసాడో అక్కడ సముద్రంలో నీరు ఇప్పుడు కూడా డిఫరెంట్ గా కనబడుతుంది. కుంకుమరక్త వర్ణం - సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రంగు కుంకుమ రంగు.

మధురైకి పదిమైళ్ల దూరంలో ఒక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రం ఉంది. దేవయాని ఇంద్రుడి కుమార్తె. ఇంద్రుడు తన కుమార్తెని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఇచ్చి వివాహం చేసాడు. దేవయాని పెళ్లి జరిగిన చోట సుబ్రహ్మణ్య క్షేత్రం ఉంది. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర

స్వామి అంటాము. వల్లీ ఎవరు, దేవసేన ఎవరు? వల్లి వెనుకబడిన వర్గాలు నుంచి వచ్చింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రేమించి పెళ్ళిచేసుకుంది. ఈవిడ సామాన్య కుటుంబం లోంచి వచ్చింది. దేవయాని దేవతా కన్య, దేవతలలోంచి వచ్చింది. వల్లి ఎవరంటే, మీరు ఏదైనా పని చెయ్యాలి అనుకున్నారు అనుకోండి, ముందు సంకల్పం రావాలి. ఇప్పుడు మీరందరూ అత్తిలి వచ్చారు. అత్తిలి వెళ్ళాలన్న సంకల్పం రాకుండా ఇక్కడికి రాలేరు కదా. ఆ సంకల్పమే వల్లీదేవి. ఊరికే సంకల్పం వస్తే సరిపోదు, ఆ సంకల్పం నెరవేరాలి. నీకు ఒక మంచి పని చెయ్యాలని సంకల్పం వచ్చిన తరువాత ఆ పని పూర్తి అవ్వాలి. దానికి క్రియా శక్తి ఉండాలి. పని చేసే శక్తి ఉండాలి. సంకల్పాన్ని వల్లి ఇస్తుంది. ఆ పని చేసే శక్తి దేవయాని ఇస్తుంది.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దగ్గర రెండు శక్తులు ఉన్నాయి - 1. సంకల్ప శక్తి, 2. క్రియా శక్తి. వల్లీదేవయానులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి యొక్క శక్తులు. మీరు ఎప్పుడైనా గుళ్ళోకి వెళ్ళినప్పుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం చేసి, వల్లీ దేవయానులకి కుంకుమ పూజ చేయించాలి. వాళ్ళిద్దరినీ విడిచిపెట్టకూడదు. వాళ్ళిద్దరూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శక్తులు. వల్లి సంకల్ప శక్తి, దేవయాని క్రియా శక్తి, అంటే పని నెరవేర్చగల శక్తి. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఉన్న రెండు శక్తులని ఇద్దరు భార్యలుగా చూపించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని తమిళులు మురుగా మురుగా అంటారు. వాళ్లకి తమిళం అంటే ఎంత ఇష్టమో మురుగా అన్నా అంతే ఇష్టం. తమిళభాష కల్పించిన వాడు, సృష్టించిన వాడు సుబ్రహ్మణ్యుడు అంటారు. సంస్కృత భాష ఎంత సనాతనమైనదో తమిళ భాష కూడా అంత సనాతనమైనది. మనం రామా కృష్ణా అని ఎలా అనుకుంటామో తమిళులు మురుగా మురుగా అనుకుంటారు.

కుంభకోణం వెళ్ళిన వాళ్ళు స్వామిమలై చూసిరండి. స్వామిమలైలో ఉన్న స్వామి మామూలు వాడు కాదు. శివుడికి కూడా గురువు. ఒకసారి ఒక పెద్దమనిషి ఓంకారం అర్థం సరిగ్గా చెప్పలేకపోతే, నీకు ఓంకార అర్థం తెలియటం లేదు, ఓంకార స్వరూపం తెలియటంలేదు అని వాడిని ఒక నెల్లాళ్ళు జైలులో పడేసాడు సుబ్రహ్మణ్యుడు. జైలులో పడేసిన

**ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలనుకొనే వారికి, హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళాలనుకునేవారికి సహనం, ముగింపులేని సహనం, అత్యంత గాఢమైన సహనం అవసరం. దానికి సిద్ధపడి ఈ మార్గంలో ప్రయాణం చేయాలి.**



వాడు మహాత్ముడు. శివుడు వాడిని విడిపించు అన్నాడు. ఓంకారార్థము నువ్వు చెప్పు వాడిని విడిపిస్తాను అన్నాడు. నాకు తెలుసా అని అడుగుతున్నావు, నీకు తెలిస్తే చెప్పు అని శివుడు, సుబ్రహ్మణ్యుడిని అన్నాడు. నువ్వు నాకు శిష్యుడిగా ఉంటే చెపుతాను అన్నాడు సుబ్రహ్మణ్యుడు. నేను దేవుడిని అని నువ్వు అనుకుంటే, నేనేమి చెపుతాను, నీకేమి అర్థం అవుతుంది, అన్నాడు. సరే నేను శిష్యుడినే చెప్పు అన్నాడు శివుడు. శివుడు పెద్దవాడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బాలుడు. వీడు కుమారుడు, వాడు తండ్రి. నేను పిల్లవాడిని, నీవు పెద్దవాడివి, చాలా ఎత్తుగా ఉన్నావు, చెప్పటం ఎలా కుదురుతుంది, నన్ను ఎత్తుకో, చెవిలో చెపుతాను అన్నాడు. అప్పుడు శివుడు ఎత్తుకుంటాడు, ఈయన చెవిలో అద్భుతంగా చెపుతాడు.

పరబ్రహ్మమునకు శబ్ద రూపం ఓంకారము. ఓం నమః శివాయ, ఓం నమో భగవతే వాసుదేవాయ, ఓం నమో భగవతే శ్రీ రమణాయ, ఓం నమో భగవతే రుద్రాయ! వీటిలో ఇడ్లీ ఓంకారము, మిగతావి అన్నీ సాంబారు, చట్నీ, పంచదార. ఒట్టి ఇడ్లీ తినలేక సాంబారు అన్నా, చట్నీ అన్నా, పంచదార అన్నా కలుపుకుంటాము. మీరు ఒట్టి ఓంకారాన్ని ఉపాసన చేస్తే చాలు. ఓంకారము అంటే పరబ్రహ్మ స్వరూపానికి శబ్దం. ఓం అని మీరు పిలుస్తున్నారు అంటే పరబ్రహ్మం యొక్క పేరు అది. ఒక వ్యక్తి పేరు కాదు. చైతన్యం యొక్క పేరు. ఓంకారం తోటి ఆ చైతన్యాన్ని ఉపాసన చేస్తారు. అయితే మనం రూపబుద్ధికి నామబుద్ధికి అలవాటు పడిపోయాము కానీ లేకపోతే ఓంకారాన్ని ఒక్క అక్షరాన్ని ఉపాసన చేసి తరించిన వాళ్ళు ఉన్నారు.

ఓంకారం యొక్క వైభవం అంతా కూడా ఒక ఉపనిషత్తులో చెప్పారు. ఓంకారంలో మూడు అక్షరాలు ఉన్నాయి. అకారము, ఉకారము, మకారము. ఈ మూడు అక్షరాలూ కలిపితే ఓంకారమే. ఆ ఓంకార అర్థాన్ని బాగా వివరించాడు వాడు. స్వామిమలైలో శివుడికి గురువైయాడు. సుబ్రహ్మణ్య భక్తులు ఎక్కువమంది అక్కడికి వెళ్తారు. అక్కడ కుమారుడి చేత ఉపదేశింపబడ్డాడు శివుడు. గ్రేటర్ సన్ అఫ్ ఏ గ్రేట్ ఫాదర్!

శివుడికి ఈ సృష్టి పని, స్థితి పని, లయం పని, ఎవడు ఏ కర్మ చేస్తున్నాడు, ఆ కర్మకి సాక్షిగా ఉండటం, మళ్ళీ కర్మకి అనుబందం చెయ్యటం, మళ్ళీ ఆ కర్మ వాడికి అనుభవంలోకి వచ్చేలా చెయ్యటం, ఈ అడ్మినిస్ట్రేషన్ అంతా శివుడికి ఉంటుంది. సనత్కుమారుడికి ఇవేమీ అక్కరలేదు. జ్ఞానమే జ్ఞానం. సనత్కుమారుడికి అడ్మినిస్ట్రేషన్ లేదు. వాడు సుబ్రహ్మణ్యుడు! జ్ఞానమంటే జ్ఞానమే. మీరు ఏ కోణం'లోంచి అడిగినా జ్ఞానం దగ్గరకి

తీసుకుపోతాడు. వాడు జ్ఞానగురువు.

మురుగుడు ఈ భూమి మీదకి ఏ పని మీద అయితే వచ్చాడో ఆ పని అంతా పూర్తి చేసి తిరుత్తణి వచ్చి అక్కడ హమ్మయ్య అని విశ్రాంతి తీసుకున్నాడు. అది శాంతి సుబ్రహ్మణ్యం. తిరుత్తణి మద్రాసుకి దగ్గరగా ఉంది, తిరుపతికి రెండుగంటల ప్రయాణం. వాడు మామూలు సుబ్రహ్మణ్యుడు కాదు, శాంతి సుబ్రహ్మణ్యుడు. వాడు అక్కడికి వచ్చి శాంతిగా ఉండిపోయాడు. ఆ శరీరం ఎందుకు వచ్చిందో ఆ పని అంతా పూర్తి అయిపోయింది. ఆ క్షేత్రాలలో చేయవలసిన పని అయిపోయింది. ఇక్కడికి వచ్చి తిరుత్తణిలో ఆ కొండ మీద సెటిల్ అయిపోయాడు. దానిని శాంతి సుబ్రహ్మణ్యుడు అంటారు. తిరుచందూరులో తారకాసురుడిని సంహారం చేయటానికి మిలిటెంట్ అయ్యాడు సుబ్రహ్మణ్యుడు, తిరుత్తణిలో రెస్ట్ తీసుకొని శాంతి సుబ్రహ్మణ్యుడు అయ్యాడు.

తమిళనాడులో ఆరు గొప్ప క్షేత్రాలు ఉన్నాయి. భూమి మీదకి పళనిలో వచ్చాడు. తరువాత తిరుచందూరు, స్వామిమలై, తిరుపరకుండ్రు, పలముడిచోలై, తిరుత్తణి మొత్తం ఆరు క్షేత్రాలు. సుబ్రహ్మణ్య భక్తులు అందరూ కూడా తమిళనాడులో ఈ ఆరు క్షేత్రాలు దర్శనం చేస్తారు.

నేను (నాన్నగారు) 15 సంవత్సరాలకి పూర్వం మద్రాస్ వెళ్ళి, అక్కడ నుంచి తిరుత్తణి వెళ్ళాను. తిరుత్తణి కొండ అన్నవరం కొండ కంటే కొంచెం పెద్దది ఉంటుంది. మామూలుగా వెళ్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని చూసి వచ్చేసాను. తిరుత్తణి సాయంత్రం వెళ్ళాము, నేను ఏదో పరాకుగా ఉన్నాను. పుష్పాలు పళ్ళు పట్టుకెళ్ళలేదు.. నమస్కారం పెట్టుకొని వచ్చేసాము. పడుకునే ముందు నా సంకల్పం ఏంటంటే, రేపు ఫస్ట్ బస్సుకి తిరువన్నామలై వెళ్లిపోవాలి. ఆ రాత్రి కలలోకి పెద్ద సర్పము వచ్చింది. ఆ సర్పము కొన్ని ఫర్లాంగులు పొడుగుంది. అంతపెద్ద సర్పాన్ని చూస్తుంటే సుబ్రహ్మణ్యుడి అనుగ్రహం వల్లనే నాకు భయం వెయ్యటం లేదు. సాధారణంగా పాముని చూస్తే భయం వేస్తుంది. ఆయన సర్ప రూపంలో ఉన్నాడు. పాము ఎలా నడిచి



**నువ్వు ఏ వృత్తిలో ఉన్నా గాని అహంవృత్తికి దూరంగా ఉండు.**

వెళ్తుందో మన వెన్నెముక కూడా అలా ఉంటుంది. అంటే మనకున్న శక్తి అంతా మూలాధారంలో ఉంటుంది. ఆ శక్తి మేల్కొన్నప్పుడు సహస్రారంలోకి వస్తుంది. ఆ సహస్రారం లోకి వచ్చినప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. శక్తిస్వరూపుడు, వేలాయుధుడు, మయూర వాహనుడు నాతో పొద్దున్నే ఎక్కడికి వెళ్తావు అన్నాడు. తిరువన్నామలై వెళ్ళిపోతున్నాను అని చెప్పాను. తిరువన్నామలై వెళ్ళిపోతున్నాను అంటున్నావు, మరి నా మాటేంటి అన్నాడు. రావటం వచ్చావు, పండు ఇవ్వలేదు, పుష్పం ఇవ్వలేదు, అష్టోత్తరం ఏమీ లేదు. సుబ్రహ్మణ్యం సుబ్రహ్మణ్యం, మురుగా మురుగా, అని ఏమి అనలేదు. చూసి వెళ్ళిపోతున్నావు. రేపొద్దున్న అలా వెళ్ళటం ఏమీ లేదు అని డిక్టేట్ చేసేసాడు. ఏమన్నాడంటే, రేపొద్దున కాఫీ తాగొద్దు అన్నాడు. నాకు ప్రొద్దున్నే కాఫీ అలవాటు అని ఆయనకి ఎలా తెలుసు? ఆయన అంతర్యామి. పొద్దున కాఫీ తాగవద్దు, స్నానం చెయ్యి, ఏవో పుష్పాలు పళ్ళు అవీ కొండపైకి తీసుకొచ్చి నాకు అర్పించి అప్పుడు తిరువన్నామలై వెళ్ళు అన్నాడు. అంటే ఈ గొడవలు అన్నీ మనల్ని అనుగ్రహించటానికి.

గురువు వైభవం ఎక్కడ ఉందంటే, మన పొరపాట్లు మన బలహీనతలు ఎక్కడ ఉన్నాయో నోటితో చెప్పడు. వాడు అంతర్యామి. గురువన్నా ఈశ్వరుడన్నా ఆత్మ అన్నా మూడు ఒక్కటే. మనకి ఏదైనా తలంపు వచ్చాక తెలుస్తుంది. ఆ తలంపు రాకముందే ఏ వాసన ఉందో గురువుకి తెలుస్తుంది. గురువు ఇలా ఉండు అలా ఉండు అని నోటితోటి ఏమీ చెప్పడు. ఇంట్లోవాళ్ళు చెప్పినట్లు కాలేజీలో పాఠం చెప్పినట్టు అలా చెప్పడు. గురువు ఆత్మ రూపంలో ఉన్నాడు. ఆత్మానుభవానికి నీలో ఏ బలహీనతలు, ఏ అలవాట్లు, ఏ ఆకర్షణలు అడ్డు వస్తున్నాయో, లోపల గురువు చూసుకుంటాడు. నీ బలహీనతలు నీకు తెలియవు. వాటిని సహస్రారంలోకి తీసుకువచ్చి, సినిమాను ప్రొజెక్టర్ లోకి తీసుకువచ్చి తెరమీద మనకి ఎలా చూపిస్తారో, అలా లోపల మన బలహీనతలని సహస్రారంలో చూపించి, ఈ బలహీనత నీకు ఉంది అని తెలియజేస్తాడు. అంతటితో ఊరుకోడు. సర్జన్ రోగం ఉందని చెప్పి ఊరుకోడు, ఆపరేషన్ చేస్తాడు. ఈ బలహీనతవల్ల నీకు ఆత్మ జ్ఞానం రావటం లేదు, నీకు స్వరూపం తెలియటం లేదు, నీవు ఏదిగా ఉన్నావో దాని తాలూకు ఎరుక రావటంలేదు, అని ఆ బలహీనత మనకి చెప్పకుండా తెలియపరుస్తాడు. ఆ బలహీనతని జయించాలి, ఆ బలహీనత లోంచి బయట పడాలనే బుద్ధిని కూడా ఆయనే కలుగచేస్తాడు. మీరు ఫాలో అవుతున్నారా సబ్జెక్టు? చిరకాలం నుంచి ఉన్నటువంటి వాసన యొక్క అలవాటు యొక్క వేగం లోంచి బయటికి రావాలి అనే బుద్ధిని నీకు కలుగ చేస్తాడు. నీతో చెప్పడు. నీకు

లోపల గురువు చేసే పని వన్ పెర్సెంట్ బయట ఉంటే, 99 పెర్సెంట్ లోపలే ఉంది. వాడు నిజమైన గురువు. ఆయన చేసే పని నీ కళ్ళకి కనబడదు, చెవులకి వినపడదు. నీకు తెలియాలని కూడా అనుకోడు. నీకు లోపల ఆత్మగా ఉన్నాడు, అందుకని అనుకోవలసిన అవసరం లేదు. అనుకోవటం వేరు, అవ్వటం వేరు. లోపల ఉండి మీ బలహీనతలని చూపిస్తాడు, చూపించి ఆ బలహీనతల లోనుంచి మీరు ఎలా విడుదల పొందాలో దాని తాలూకు శక్తిని ఇస్తాడు. శక్తిని ఇచ్చి మార్గం చూపిస్తాడు. ముందు మనకి ఆ సంకల్పం కలుగ చేస్తాడు.

ఆ సంకల్పం కలుగ చేసేది వల్లీదేవి, సంకల్పాన్ని నెరవేరేలాగ చేసేది దేవయాని. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఇద్దరు భార్యలు అంటే, రెండు శక్తులవి. ఇలా అర్థం చేసుకోవాలి. నువ్వు వాసనా రహితుడివి అవ్వాలి, ఈ మనస్సు పెట్టే క్షోభ లోంచి బయటపడాలి, ఇదొక పెద్ద ఫారెస్ట్ అని తెలియాలి. ఈ ఫారెస్ట్ లో ఉన్నాను, ఈ సంసారం అనేది పెద్ద అడవి. ఈ అడవిలోంచి బయటకి రావాలి అనే సంకల్పం తీసుకువచ్చేదే వల్లీదేవి. ఆ సంకల్పానికి శక్తినిచ్చి, ఆ సంకల్పం నెరవేర్చేలా చేసేది దేవయాని.

లోపల శక్తిని కలుగచేసి, ఆ అలవాటు వలన, బలహీనత వలన, వచ్చే నష్టాలు ఏంటో నీకు ఎరుకపరుస్తాడు. నిన్ను ఎడ్యుకేట్ చేస్తాడు. బయటికి ఏమీ తెలియనట్లు ఉంటాడు. పనంతా లోపలే చేసుకుంటూ వెళ్ళిపోతాడు. ఆయన చేసిన ఉపకారం ఎప్పుడైనా తెలుస్తుంది అనుకోండి, మీరు మాకు ఎంత  ఉపకారం చేసారో అంటారనుకోండి, నాకు ఏమీ తెలియదు అని చెప్తాడు. ఎందుచేత మీ గుర్తింపు ఆయనకు అక్కరలేదు? గుర్తింపులు వచ్చేసరికి అహంకారము వస్తుంది. ఏది పోగొట్టుకోవాలో దానిని పెంచుకోకూడదు. ఏదైనా గుర్తింపులు కోరామా, అజ్ఞానం పెరిగిపోతుంది. ఒక్క మాట గుర్తు పెట్టుకోండి. గుర్తింపులు కోరుతూ, లోకవాసన తోటి ప్రయాణం చేస్తూ, ఎంత ముందుకు వెళ్ళిపోయామో, మళ్ళీ మన మనస్సుని అంత వెనక్కి లాక్కుంటే కాని ఆత్మజ్ఞానం రాదు. అత్తిలి నుంచి వెయ్యి మైళ్ళు వెళ్ళిపోయారు అనుకోండి, మళ్ళీ వెయ్యి మైళ్ళు వెనక్కి వస్తేనే అత్తిలికి వస్తారు కాని

**కర్మను యోగంగా చేసేవాడికి అంతఃకరణములో ఉన్న దోషములు వాటి అంతట అవే రాలిపోయి అనంతమైన జ్ఞానంలోనికి ప్రవేశిస్తాడు.**



లేకపోతే రాలేరు, అలాగే చైతన్యాన్ని విడిచిపెట్టి, ఆత్మని విడిచిపెట్టి, ఎంత దూరం వెళ్తారో, అంత దూరం వెనక్కి రావలసిందే. లేకపోతే చైతన్యంలో ఐక్యం కాలేరు. మీకు ఏ బలహీనతలు ఉన్నాయో చూపిస్తాడు. నిన్ను ఆ వాసనలోంచి విడుదల చెయ్యటానికి ప్రయత్నం చేస్తాడు. విడుదల చేసే శక్తిని ఇస్తాడు. ఆయన విడుదల చెయ్యటానికి ప్రయత్నం చేసినప్పుడు కూడా, అనుగ్రహం ఇచ్చేటప్పుడు కూడా నీ వాసనని నీ అలవాటుని బయటికి కక్కకపోతే , సర్జరీ చేసి వదిలేస్తాడు. వాడు గురువు! ఇటు చెప్పినా అటు చెప్పినా నిన్ను ఉద్ధరించే వరకూ విడిచిపెట్టడు. వాడు గురువు!

శరీరం ఎంత నిజమో, మనం చెప్పుకునే మాటలు కూడా అంతే నిజం. అసలు అంతా లోపలే ఉంది. బయట ఏమీ లేదు. మన అజ్ఞానం వలన అక్కడేదో ఉంది ఇక్కడ ఏదో ఉంది అని అనుకొని పరిగెడుతున్నాము. మనకి కోరికలు ఉన్నాయి కాబట్టి, వాసనలున్నాయి కాబట్టి బయట ఏదో ఉంది అనిపిస్తుంది. అదే మాయ. నీకున్న అలవాటుని బట్టి, కోరికలని బట్టి, బయట ఏదో ఉంది అనుకుంటున్నావు. బయట ఏమీ లేదు. నిజమైన నేనుకి లోపల లేదు, బయట లేదు. మనకి లోపలి గొడవ, బయటి గొడవ, ఇది అజ్ఞానానికి గుర్తు, అవిద్యకి గుర్తు. బంధానికి గుర్తు, మోక్షానికి చాలా దూరంలో ఉన్నావని గుర్తు. ఆత్మ వైభవానికి, ఆత్మజ్ఞానానికి స్కందుడికి చాలా దూరంలో ఉన్నావని గుర్తు. ఎందుకు ఈ లోపలా బయటా? ఇది అంతా దొంగ నేను చెపుతోంది, నిజమైన నేనుకి లోపల లేదు బయట లేదు. ఉన్నది ఏదో ఉంది. దొంగ నేను దేహాన్ని చుట్టుకుంటుంది. దేహాన్ని నేను అంటుంది, మనస్సుని నేను అంటుంది, తెలివిని నేను అంటుంది, బుద్ధిని నేను అంటుంది. ఇవన్నీ నీవు కాదు. నువ్వు కాని దానితోటి జత కూర్చి ఇక్కడ ఉన్నాను అక్కడ ఉన్నాను లోపల ఉన్నాను బయట ఉన్నాను అంటుంది. ఇవి ఈ దొంగ నేను చేసే చేష్టలు గాని నిజమైన నేనుకి లోపల లేదు, బయట లేదు. నేను లోపల ఉన్నాను, నా బయట ప్రపంచం ఉంది, వైకుంఠంలో నారాయణుడు ఉన్నాడు, కైలాసంలో శివుడు ఉన్నాడు అనుకోవటం ఈ దొంగ నేను ఎంత నిజమో ఇవన్నీ కూడా అంతే నిజం. నిజమైన నేనుకి ఇవన్నీ అక్కరలేదు. బాడీ లెస్, మైండ్ లెస్, వరల్డ్ లెస్, అండ్ గాడ్ లెస్ ఆల్సో! మనకి జ్ఞానం రాదు అనుకోకండి.

జ్ఞానం రావటానికి, శాంతిస్థానం పొందటానికి, సుఖస్వరూపం పొందటానికి, ఒక్క దేవతాపురుషుడి అనుగ్రహం సరిపోతుంది. అదే భగవాన్ చెప్పారు కదా, వన్ వర్డ్ ఈజ్

ఎనఫ్, వన్ లుక్ ఈజ్ ఎనఫ్, వన్ టచ్ ఈజ్ ఎనఫ్! మనవి శవ నేత్రాలు, జ్ఞాని నేత్రాలు శవ నేత్రాలు కాదు. ఎక్కడో మీ హృదయ కుహరంలోకి చూస్తాడు. మన నేత్రాలు చర్మాన్నే చూస్తాయి. జ్ఞాని నేత్రాలతో మన హృదయం యొక్క లోయలలోకి వెళ్ళి చూస్తాడు. అక్కడ ఏముందో చూస్తాడు, దైవం తాలూకు, జ్ఞానం తాలూకు ఎరుక ఎందుకు రావటంలేదో చూస్తాడు. అక్కడ ఉన్న డస్ట్ ని కెలుకుతాడు. కెలికి నీ బుద్ధికి చూపించి బయటికి లాగుతాడు. వాడు నిజమైన గురువు, వాడు ఇలా చెయ్యండి, అలా చెయ్యండి, ఇలా కూర్చోండి, అలా కూర్చోండి అని నిజమైన గురువు చెప్పడు. బయట నోటితోటి చెప్పకుండా, లోపల ఉండే చేసుకుపోతాడు. ఇట్ ఈజ్ ఏ ట్రూ ఐ, ఇట్ ఈజ్ ఏ లాయల్ ఐ, ఇట్ ఈజ్ ఏ కింగ్లీ ఐ. ఆ పరమాత్మే నిజమైన నేను. మనం చెప్పే నేను దేహానికే పరిమితం అయ్యి ఉంటుంది. బయట ఏదో ఉంది, లోపల ఏదో ఉంది అని చెప్పేది కూడా దొంగ నేనే.

శివుడి యొక్క మూడవ నేత్రంలోంచి వచ్చినటువంటి అగ్ని శరవణ తటాకంలో పడితే, అక్కడి నుంచి రూపం ధరించింది. శరవణ అనే తటాకంలోంచి ఉద్భవించిన వాడు కాబట్టి శరవణభవ. భగవద్గీతలో కృష్ణుడు చెపుతాడు, స్కందుడి రూపంలో ఉన్న వాడిని నేనే. వాడికి నాకు బేధం చూడకండి. రామః, శంకరః, స్కందః -- అంటే స్కందుడిని కూడా మీరు ఉపాసన చేసుకోండి అని. ఆయన జ్ఞాన గురువు.

కృప అనేది, దయ అనేది నీ లోపలే ఉంది. అనుగ్రహం కూడా నీ లోపలే ఉంది నీ కోసం ఎదురు చూస్తోంది. నువ్వు ఎప్పుడు దొరుకుతావా, లోపలికి లాగి తన స్వరూపం ఇవ్వటానికి ఎదురుచూస్తోంది. దేవుడు నీ లోపల ఉన్నాడు, అనుగ్రహం నీ లోపల ఉంది, తన వడిలోకి తీసుకోవటానికి సిద్ధంగా ఉంది. తన చేతికి మనం దొరకటం లేదు కాబట్టి, తన చేతికి దొరకటానికి మనల్ని ప్రిపేర్ చేస్తోంది. అంతర్యామి లోపలే ఉన్నాడు. ఈశ్వరుడు లోపలే ఉన్నాడు. లోపల ఉన్న పరమాత్మని తెలుసుకోవాలి అనే కాంక్ష వస్తోందనుకోండి అది కూడా మీ తెలివి కాదు. అది కూడా మీ గొప్ప ఏమీ కాదు. ఆ లోపల ఉన్న చైతన్యం యొక్క



**ఆత్మశాంతి అంటే మనకి ఏవో కోరికలు నెరవేరినప్పుడు వచ్చే శాంతి లాంటిది కాదు ఈ శాంతి, ఇట్ ఈజ్ బియాండ్ అవర్ అండర్‌స్టాండింగ్, ఇట్ ఈజ్ ఇండిపెండెంట్ పీస్, నాట్ డిపెండంట్ పీస్. ఇట్ ఈజ్ బియాండ్ ఇంటలెక్ట్. దట్ పీస్ ఈజ్ నాట్ యాన్ ఆబ్జెక్ట్ అఫ్ యువర్ ఇంటలెక్ట్.**

అనుగ్రహం మీకు ఉన్నప్పుడు దానిని తెలుసుకోవాలనే బుద్ధి పుడుతుంది కానీ, లేకపోతే మీకు ఆ బుద్దే రాదు. లేకపోతే ఏదో ఒక విషయచింతన వచ్చేస్తుంది. మీకు పరమాత్మ చింతన రావటం లేదు అనుకోండి, రోజూ విషయచింతన వచ్చేస్తుంది అనుకోండి, ఆ విషయ చింతన ఆపుచేసుకోలేక పోతున్నారు అనుకోండి, అప్పుడు చలం గారు అన్నారు ఒక గొర్రెని కొనుక్కొని దాని వెంట్రుకలు లెక్క పెట్టుకోమన్నారు. విషయచింతన కంటే ఆ గొర్రి వెంట్రుకలు లెక్కపెడితే మీకు కాలక్షేపం అయిపోతుంది అన్నారు. విషయ చింతన విషం తోటి సమానం. విషం విషం కాదు, విషయచింతనే విషం. మనం కాఫీ దొరకటం లేదని ఎండ్రిన్ తాగము. అలాగే గౌతమ బుద్ధుడు చెప్పాడు, మీకు గుడ్ కంపెని దొరకకపోతే గుడ్ కంపెని దొరకలేదని బాడ్ కంపెనీలోకి వెళ్ళకు. గుడ్ కంపెని దొరకకపోతే, అడవిలో ఏనుగులాగా ఒంటరిగా బ్రతుకు అన్నాడు.

కృష్ణుడు చెపుతాడు ఈ లోకంలో కానీ ఇతరలోకాలలో కానీ, జ్ఞానంతో సమానమైనది కానీ, జ్ఞానానికి మించినది కానీ లేదు. జ్ఞానం నిన్ను పవిత్రం చేసినట్టుగా ఏదీ నిన్ను పవిత్రం చెయ్యలేదు. ఆ వైభవం జ్ఞానానికే ఉంది. జ్ఞానం లేకుండా శాంతి లేదు, జ్ఞానం లేకుండా మోక్షం లేదు, జ్ఞానం లేకుండా పరమాత్మ లభ్యము కాడు. జ్ఞానం లేకుండా నిర్వాణసుఖం లేదు, జ్ఞానం లేకుండా స్వర్గరాజ్యము లేదు. ఇప్పుడు మనకి ఉన్నది మిధ్యాజ్ఞానము. సనత్కుమారుడు చెప్పింది సత్యజ్ఞానము, ఆత్మజ్ఞానము, బ్రహ్మజ్ఞానము. ఏసుక్రీస్తు చెపుతాడు, యు మస్ట్ నో థ ట్రూత్, అండ్ థ ట్రూత్ షల్ మేక్ యు ఫ్రీ! మీకు మీ లోపల ఉన్న సత్యజ్ఞానం ఎరుకలోకి రాకపోతే, సత్యం మీకు అనుభవం లోకి రాకపోతే, ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలో కూడా మీకు స్వేచ్ఛ లేదు స్వాతంత్య్రం లేదు, సుఖం లేదు, శాంతి లేదు. జ్ఞానం సంపాదించటానికి డబ్బు అక్కరలేదు, తెలుసుకోవాలనే కాంక్ష చాలు. ఆ శ్రవణం చెయ్యాలనే ఇంట్రెస్ట్ మీ లోపలి నుంచి రావాలి. గురువు చూస్తొ ఉంటాడు. జ్ఞానాన్ని మీ చేత తాగిస్తాడు. చెప్తాడు చెప్తాడు, మీరు వినకపోతే, ఒకో గురువు ఏంచేస్తాడు అంటే; కొంతమంది దూడలకి గొంతులో గొట్టం పెట్టి పోసేస్తారు. అలా గురువు మీకు కూడా పోసేస్తాడు. మీరు వినకపోతే, పడగొట్టేసి గొట్టం నోట్లో పెట్టేసి జ్ఞానాన్ని పోసేస్తాడు. అంటే మీరు ఏమనుకొంటున్నారో వాడికి అక్కరలేదు. వాడు మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళ్ళాలో అక్కడికి తీసుకెళ్ళేవరకూ వేటగాడు జంతువుని ఎలా వెంటాడతాడో, ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలలో కూడా మీ గురువు మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటాడు. గురువు కృప బలీయమైనది.



# అరుణాచల మహత్త్యం
# అక్షరమణమాల

**గిరి రూపమైనట్టి కరుణా సముద్రమా**

**కృపచేసి నన్నేలు మరుణాచలా!**

నీవు పైకి కొండరూపమున కనిపిస్తున్న గొప్ప కరుణాసముద్రుడవు. నీ కరుణను నాపైన కురిపించి నన్ను కాపాడు అరుణాచలా!

నువ్వు కొండలాగా కనిపిస్తున్నావు. కానీ నువ్వు దయా సముద్రుడవు. నువ్వు కరుణా సముద్రుడవు. భగవంతుడు యొక్క అనుగ్రహం, శివుడి యొక్క అనుగ్రహం గిరి రూపం ధరించింది. అంటే మీకున్న అజ్ఞానాన్ని తొలిగించి, జ్ఞానం వైపు మీ కళ్ళు తెరిపించటం కోసం, మిమ్మల్ని సత్యం వైపు మేల్కొల్పటం కోసం వచ్చినటువంటిదే ఇది. మిమ్మల్ని రక్షించేదే కానీ శిక్షించేది కాదు.

గిరి రూపమైనట్టి కరుణాసముద్రమా! నువ్వు గిరి రూపంలో కనిపిస్తున్నావు కానీ, నువ్వు కరుణా సముద్రమే! కరుణా సముద్రుడవే, దయా సముద్రుడవే! కొండ రూపంలో కనిపిస్తున్న జ్ఞాన గిరివి నువ్వు. జ్ఞాన సముద్రుడవు, దయా సముద్రుడవు, కరుణా సముద్రుడవు అని ఎంతమందికి తెలుసు? ఊరికే నిన్ను కొండ కొండ అనుకుంటున్నారు కానీ, నీ దగ్గర నుంచి వచ్చేవి దయా తరంగాలు.

భగవంతుడు మీకు ఏది ఇచ్చినా, అది మీ సొంతం అనుకోవద్దు, భగవంతుడు ఇచ్చిన వరాలు అనుకోండి. మన సొంతం అంటూ ఏమీ లేదు. మనకి ధనం, విద్య,

తెలివితేటలు, ఏది వచ్చినా అది భగవంతుడు ఇస్తేనే వస్తుంది, లేకపోతే రాదు. కానీ భగవంతుడు ఇచ్చింది మన సొంతం అనుకొంటున్నాము. మన సొంతం అంటూ ఈ సృష్టిలో ఏమీ లేదు. భగవంతుడు ఇచ్చింది ఆయన ఇచ్చాడు అనుకోకుండా మన సొంతం అనిపిస్తుంది.

ఆయన అనుగ్రహం మీకు వచ్చినప్పుడు, అది ఆయన అనుగ్రహం అని మీకు తెలుస్తూ ఉంటుంది. మీకు ఏదైనా వచ్చినప్పుడు, అది ఆయన దయ వల్ల వచ్చింది, కానీ మనం సంపాదించటం వల్ల రాలేదు అని మీ అనుభవం లోకి వస్తుంది. మీరు ఊహల మీద కవిత్వాల మీద ఆధారపడనక్కరలేదు. ఫిజికల్ గా ఒక చెయ్యి ఇంకో చెయ్యిని ముట్టుకొన్నప్పుడు ఆ టచ్ ఎలా తెలుస్తుందో, మీ మనస్సు అంతర్ముఖం అయినప్పుడు వచ్చే ఆనందం, ఇది అంతా మీరు చేస్తున్న సాధన వల్ల జరగటం లేదు, ఆయన దయవల్లే జరుగుతోంది అని మీకు స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. ఆయన అనుగ్రహం వల్లే, ఆయన దయ వల్లే, మనకి జ్ఞానం కలిగింది అని భౌతికంగా కూడా మీకు తెలుస్తూ ఉంటుంది. దీనికి రుజువులు సాక్ష్యాలు అవసరంలేదు.

గిరి రూపమైనట్టి కరుణాసముద్రమా, క ృపచేసి నన్ను ఏలుము అరుణాచలా! అరుణాచలేశ్వరుడా నువ్వు నాకు యజమానివి. అందుచేత నువ్వే నన్ను రూల్ చెయ్యి.

భగవంతుడి అనుగ్రహం లేకుండా, భగవంతుడి దయ లేకుండా ఆయన మాయ మనకి దారి ఇవ్వదు. భగవంతుడి దయ ఉంటే, మాయ మనకి దారి ఇస్తుంది, అప్పుడు ఆయనలో ఐక్యం అవుతాము. దేవుని దయ సంపాదించటమే నిజమైన ఆస్తి. మన మాటలో, చేతలో, మన ఆలోచనలో దేవుని దయ సంపాదించటానికి ప్రయత్నం చెయ్యాలి. ఆయన గ్రేస్, దయ, ఉంటే చాలు. ఇంకేమీ అక్కరలేదు. ప్రతీదీ ఆయన అనుగ్రహమే.

**మన దేహ ప్రారబ్ధమును భగవంతుడు నిర్ణయిస్తాడు. అది అనుభవిస్తే పోతుంది అనేటటువంటి విశ్వాసం కనుక మనకు ఉంటే ప్రారబ్ధం పేరు మీద మనకు వేదన తగ్గుతుంది, రోదన తగ్గుతుంది, బాధ తగ్గుతుంది.**





# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**- సేకరణ : బేబీ, హైదరాబాద్**

భగవద్గీత అంటే భగవంతుడు చెప్పిన మాట. మనకి భగవంతుడి మీద ప్రేమ, భక్తి, ఇష్టం ఉంటే, భగవంతుడి మాట మీద కూడా ఇష్టం ఉంటుంది.

**కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణం ॥ (3-37)**

మనుషులని పీడించేవి కామక్రోధాలు. పూర్వజన్మల నుంచీ మనకున్న కామక్రోధాల యొక్క వేగం వల్లే మనకి ఈ శరీరం వచ్చింది. కామక్రోధాలు అన్నా రాగద్వేషాలు అన్నా ఒకటే. ఈ జీవుడు మోక్షం పొందకుండా, స్వరూపజ్ఞానం పొందకుండా, గజేంద్రుడిని మొసలి పట్టుకొన్నట్టు, ఈ కామక్రోధాలు జీవుడిని పట్టుకొని దేహానికి బంధించి ఉంచాయి. ఏదైతే బ్రహ్మమో అదే మనమైనప్పటికీ, దాని తాలూకు అనుభవం కానీ, సుఖం కానీ, శాంతి కానీ, దాని తాలూకు ఉండటం కానీ, మనకి అనుభవం లోకి రాకుండా చేసేవి ఈ కామక్రోధాలే! మనిషిని సంసారంలో బంధించి దుర్గతికి పాలవటానికి కారణం కామం. కామం అంటే కేవలం స్త్రీపురుష సంబంధించిన వాంఛే కాదు. మొత్తం అన్ని కోరికలూ కూడా కామంలోకే వస్తాయి. కామం అన్నగారైతే కోపం తమ్ముడు! ఇవి రెండూ కవలపిల్లలు; ఒకదాని వెంట ఒకటి ఉంటాయి.

కోరిక అనేది రజోగుణం లోంచి వస్తుంది. "కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః" అన్నారు స్వామి. సత్వగుణం, రజోగుణం, తమోగుణం - ఈ మూడు గుణాలూ మాయ; వీటిని ప్రకృతి అంటారు. మనకి స్వరూపజ్ఞానం లేకపోవటానికి ఈ మూడు గుణాలే కారణం.

సత్వగుణం ఉన్నవాడు నిదానంగా ఆలోచిస్తాడు. కామక్రోధాలలోంచి విడుదల పొందుదాము అనే వివేకం కలుగుతుంది. రజోగుణం లోంచి కామక్రోధాలు పుడతాయి. ఎక్కడైతే రజోగుణం ఎక్కువ ఉందో అక్కడ కామక్రోధాలు కూడా ఉంటాయి. సర్వసాధారణంగా ఈ కామక్రోధాలు మనస్సులో ఉంటాయి. ఇంద్రియాలు మనస్సుని ఆకర్షిస్తాయి. ఇంద్రియాల మూలంగా మనస్సు తొందరగా బహిర్ముఖం అవుతుంది. పెరుమాళ్ళ అనుగ్రహం లేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. అంచేత స్వామి ఏమంటున్నారు అంటే, నువ్వు బాగుపడినా నీ మనస్సే కారణం, నువ్వు పాడైపోయినా నీ మనస్సే కారణం.

నువ్వు ఏదైనా పని మొదలుపెట్టినప్పుడు ఆ పని సాధించటమే ముఖ్యం కాదు, దానికి అవలంబించే విధానం కూడా సక్రమంగా ఉంటే, నీ బుద్ధికి ఏకాగ్రత వస్తుంది, నీ బుద్ధి మనస్సు బాగుపడతాయి. మనస్సు బాగుపడితే నువ్వు శ్రేయస్సు పొందుతావు. మంచి పనులు గొప్పల కోసం చేయటం కాదు, మంచి కోసం చేస్తే దేవుని అనుగ్రహం వస్తుంది. మనకి సంపదలు పదవులు ఉన్నా మంచి బుద్ధి లేకపోతే ఏంచేసుకొంటాము. ఆ సంపదలు పదవులే మన బుద్ధిని పాడుచేస్తాయి.

దేహము కంటే ఇంద్రియములు, ఇంద్రియములకంటే మనస్సు, మనస్సు కంటే బుద్ధి గొప్పది. ఆ బుద్ధి కంటే పరాత్పరుడు అనేటటువంటి, ఆత్మ, అంటే లోపలా బయటా అంతటా వ్యాపించి ఉన్న చైతన్యం గొప్పది. చైతన్యము తప్పించి, శరీరము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, ఇవన్నీ జడములు. ఇందులో అంతా నా మాయ వ్యాపించి ఉంది. నువ్వు బుద్ధిని దాటకపోతే, నువ్వు మనస్సు చుట్టూ తిరుగుతూ ఉంటే నువ్వు మాయలో ఉన్నట్టే లెక్క. నా యందు నీకు భక్తి లేకుండా, నా యందు నీకు విశ్వాసం లేకుండా, నా స్వరూపం తాలూకు జ్ఞానం లేకుండా, నా గుణసంపద నీకు తెలియకుండా, నా మాయని నీవు అతిక్రమించలేవు అన్నాడు పరమాత్మ, అంటే నీకు మాయ దారి ఇవ్వదు.

ప్రతీ మనిషికీ సుఖం కావాలి. ప్రపంచంలో ఏ వస్తువులోను సుఖం అనేది లేదు. నువ్వు డబ్బు సంపాదిస్తే నీకు భోగం వస్తుంది కానీ స్వరూప సుఖం రాదు. ఎన్ని భోగాలు అనుభవించినా, అది మహాశనో -- మహా శనిగాడు వాడు. భోగాలు అనుభవించే కొలదీ అంతులేకుండా పెరిగిపోతాయి. పూర్వజన్మలలో అనుభవించిన భోగాలే ఈ జన్మలో మనిషికి రోగాల క్రింద వస్తాయి. డబ్బు చేసే పని డబ్బు చేస్తుంది కానీ, జ్ఞానం చేసే పని, విద్య చేసే పని డబ్బు చెయ్యలేదు. మీ స్వరూపంలోనే సుఖం ఉంది. నువ్వు సుఖం కోసం ఎన్ని జన్మలు బయట వెదికినా అది దొరకదు.

కామం అంటే కోరిక. కోరిక అనుభవించే కొలది పెరిగిపోతుంది కాని అది ఇంక

తగ్గదు. ఆశ అనే గొయ్యిని ఎవడూ పూడ్చలేడు. అది మహా శని. అంటే మీరు దేశాన్ని అంతా సంపాదించినా మీకు ఆశ తగ్గదు, ఇంక ఆ గొయ్యి పూడదు. వెయ్యికోట్లు డబ్బు సంపాదించి మీ పిల్లలకి ఇచ్చినా వాళ్ళు సంతృప్తి పడరు. వాడికి మంచి గుణం లేకపోతే మీరు ఇచ్చిన వెయ్యికోట్లు తినేస్తాడు కాని మీ శవం కూడా స్మశానం వరకూ రాడు. వాడికి కృతజ్ఞత ఉంటుందని మీరు అనుకోవద్దు. అది మానవుడి యొక్క స్వభావం.

కామం అనేది మహా శని. ఇదొక్కటే మీరు రాసుకోండి, మిగతావి అన్నీ నేను చెప్పినవి మీరు మర్చిపోయినా పర్వాలేదు. వచ్చిన కోరికనల్లా నెరవేర్చుకొంటూ ఇంతవరకూ కోరికలు సంతృప్తి పరుచుకున్న వాళ్ళు కానీ, కోరికలు జయించిన వాడు కానీ ఈ ప్రపంచంలో లేడు. కోరికలు నెరవేర్చుకొంటూ కోరికలు జయించిన వాడు ఎవడూ లేడు.

నిప్పులో కిరసనాయిలు వేస్తే మంట ఎలా పెరిగిపోతుందో అలాగ నువ్వు కోరికలు నెరవేర్చుకొనే కొలదీ ఆ కోరికలు అంతులేకుండా పెరిగిపోతాయి. ఒక కోరిక నెరవేరితే ఆ నెరవేరిన కోరిక ఇంకో పది కోరికలని తీసుకువస్తుంది. పరమాత్మ కోరికకి మహాశని అని పేరు పెట్టాడు. నువ్వు కామక్రోధాలని సంతృప్తి పరచుకొంటూ వెళితే దానికి ముగింపు లేదు. చివరికి నువ్వు శవాలని మోస్తూ ఉండాలి. అలాగని నీ పొట్టకోసం బట్టకోసం ఇతరుల మీద ఆధారపడకు. నీ శరీర యాత్రకి అవసరమైనంతవరకు నువ్వే సంపాదించుకో, అంతేకానీ కోట్లు పోగుపెట్టేద్దాము అనుకోకు. కామక్రోధాల యొక్క వేగాన్ని తగ్గించుకోవటానికి నువ్వు సాధన చేసుకో.

నీకు ఏదైనా కోరిక వస్తే ఆ కోరికని సంతృప్తి పరచుకోవటం కంటే ఆ కోరికని నిగ్రహించుకోవటం వల్ల నీకు ఎక్కువ సంతోషం వస్తుంది. ఎక్కువ శాంతి ఆనందం వస్తుంది. నువ్వు కోరికలతోటి పోరాడి వాటిని జయించలేవు. మనకి భగవంతుడిని తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగితే, అజ్ఞానం లోంచి బంధంలోంచి విడుదల పొందాలనే తపన పెరిగితే, ఆ పెద్ద కోరిక మనకు వచ్చే చిన్న కోరికలను అన్నిటినీ తగ్గించేస్తుంది. మీరు సినిమాకి వెళదామని అనుకుంటున్నారు. డాక్టరుగారు మీ గుండె తేడాగా ఉంది హాస్పిటలుకి వెళ్ళండి అంటే ఆ సినిమా దృష్టి వెంటనే మరిచిపోతారు. అంటే సినిమాకి వెళ్ళాలనే కోరికని హాస్పిటలుకి వెళ్ళాలనే కోరిక తరిమేసింది కదా! అలాగే మీరు భగవంతుడిని పొందాలి, మోక్షం పొందాలి అనే కోరిక పెట్టుకొంటే చిల్లర కోరికలు వాటంతట అవే పోతాయి. వాటితో పేచీ పెట్టుకోనక్కరలేదు.

ఇప్పుడు మీకు ఇంద్రియములో కోరిక పుడుతుంది అనుకోండి, ఆ ఇంద్రియం మనస్సుని లాగటానికి చూస్తుంది. ఎందుచేతంటే మనస్సు కనెక్షన్ లేకపోతే ఆ ఇంద్రియం పని చెయ్యదు. అప్పుడు మనస్సు భగవంతుడికి కట్టేసి ఉందనుకోండి, మైండ్ భగవంతుడి

స్మరణలో ఉందనుకోండి, ఇంద్రియం పవర్ లెస్ అయిపోతుంది. మైన్డుని ప్రకృతి వైపు లాగలేదు. ఇంద్రియం ప్రయత్నం చేసి ఫెయిల్ అయ్యేకొలదీ, మనస్సుని ప్రపంచం వైపుకి లాగే ప్రయత్నం మానుకొంటుంది. అలా స్లోగా ప్రాపంచిక ఆకర్షణలు తగ్గుతాయి.

మనకి బాహ్యవిషయాల మీద ఎంత ఇష్టం ఉందో అంత ఇష్టం అంతర్యామి అయినటువంటి నారాయణుడిమీద కలిగితే మన మనస్సుకి లోచూపు కలుగుతుంది. భగవంతుడి పట్ల మనకి చలించని విశ్వాసం ఉంటే దానికి ప్రతిఫలంగా ఆత్మవిద్యని మనకి ప్రసాదిస్తాడు. ఆత్మ విద్య ఒక్కటే మనకి స్వేచ్ఛని సుఖాన్ని స్వాతంత్ర్యాన్ని కలిగిస్తుంది. మిగతా విద్యలన్నీ పొట్టకి సంబంధించిన విద్యలు. భగవంతుడే మనలో నిజమైన ఆత్మగా ఉన్నాడు.

దేహం తోటి మనస్సు తోటి తాదాప్యం పొంది అది నేను అనుకొంటున్నావు. ఈ ఆస్తి డబ్బు, గౌరవం, ఇవన్నీ చుట్టబెట్టుకొని నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటున్నావు. ఈ నేనుని విడిచిపెట్టకుండా భగవంతుడిని పొందలేవు. అంటే జీవలక్షణాలు పోకుండా నువ్వు ఆత్మని పొందలేవు. నీకు రెండూ కావాలంటే సాధ్యం కాదు. నీకు స్వరూపజ్ఞానం కావాలంటే అజ్ఞానం అవిద్య విడిచిపెట్టాలి అన్నాడు ఏసు.

ఉన్న వస్తువు ఒక్కటే, అదే బ్రహ్మము. జగత్తు జీవుడు ఈశ్వరుడు ఇవన్నీ అజ్ఞానము యొక్క కల్పితములు. ఏదైతే నిజమో అది అబద్దంగా మనకు కనిపిస్తోంది, ఏదైతే అబద్దమో అది నిజంగా కనిపిస్తోంది. దీనికి కారణం మాయ! ఆ మాయ మనస్సులో ఉంది, బుద్ధిలో ఉంది, ఇంద్రియాలలో ఉంది. ముందు మీలో ఉన్న విషం పిండితే, మీలో ఉన్న మాయని కక్కిస్తే, ఆ బంధం తెగిపోతే, అప్పుడు ఉన్నది ఉన్నట్టు కనిపిస్తుంది, లేనిది లేనట్టు కనిపిస్తుంది. అప్పటివరకూ ఉన్న నారాయణ స్వరూపం లేదనుకొంటావు, లేని సంసారం లేని ప్రపంచం ఉందనుకొంటావు. ఈ ప్రపంచం అబద్దం అని చెప్పినా మాయ నమ్మనివ్వదు అన్నారు భగవాన్. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే, నా యందు పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవాడికి, సజీవమైన నమ్మకం ఉన్నవాడికి మాయ దారి ఇస్తుంది కాని, నా మీద నమ్మకం లేనివాడు వాడు ఎంత సాధన చేసినా, వాడి తెలివితేటలు వల్ల మాత్రమే నా మాయని అతిక్రమించలేడు అని పరమాత్మ చెప్పాడు.

మహాశనో మహాపాప్మా -- మీరు అందరూ బుద్ధిమంతులే కాని మీరు పాపాలు చెయ్యటం మానరు. కామ క్రోధాలు పాపం చేయిస్తాయి. మనం మంచిగా ఉండాలి, చెడ్డగా ఉండకూడదు. మంచిగా బ్రతకాలి, బుద్ధిగా బతకాలి అని మీరు అనుకుంటారు కానీ కోపం వచ్చినప్పుడు కామం వచ్చినప్పుడు మీరు బుద్ధిగా ఉండలేరు, శుచిగా ఉండలేరు. కోపం వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలనుకొంటారు, కానీ తింగర మాటలు అన్నీ మాట్లాడేస్తారు. ముందు

మర్యాదగానే ఉంటారు, కోపం వచ్చినప్పుడు తట్టుకోలేరు. కామక్రోధాలు అన్నదమ్ములు. అవి ఎక్కడ ఉంటే అక్కడ ఇష్టాలు అయిష్టాలు ఉంటాయి, పునర్జన్మలు పెంచేస్తాయి. ఈ కామం క్రోధం ఆశ అసూయ, ఇవన్నీ నరకానికి వెళ్ళే మెట్లు , ఇవి మీకు నరకానికి దారి చూపిస్తాయి. అందుచేత ఈ శరీరానికి మరణం రాకముందే, పోనీ వీటిని పూర్తిగా తగ్గించుకోలేక పోయినా వాటి వేగం తగ్గించుకో. ఒక జన్మలో వాటిని పూర్తిగా తగ్గించుకోవటం నీకు కష్టం అవ్వచ్చు, కనీసం వాటి వేగం తగ్గించుకో. ఇంత డీటైల్డుగా చెప్పినా మనకి ఎందుకు బుద్ధి రావటం లేదు అంటే, మనకి పుణ్యబలం లేదు. మనకి ఒక మంచి తలంపు లేదు, మంచి ఆలోచన లేదు, మంచి చేత లేదు, ఇంక మనకు మాయ దారి ఇవ్వదు.

వైరిణం -- మా అత్తగారు శత్రువు, మా మేనత్త శత్రువు, వాళ్ళు శత్రువులు వీళ్ళు శత్రువులు అని మీరు అనుకొంటున్నారు.  మీకు ఎవరిమీద అయితే ఇష్టం లేదో వాళ్ళు శత్రువులు అనుకుంటారు. ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే నీకున్నది ఒక్కడే శత్రువు, నీలో ఉన్న కామమే నీకు శత్రువు. కామం నిన్ను జీవితం పొడుగునా పీడించేస్తుంది -- అది పిశాచం. మనిషిని పిశాచం పట్టుకుంటే విడిచిపెట్టదు. వాళ్ళు శత్రువులు వీళ్ళు శత్రువులు అని కామం అనిపింపచేస్తుంది.  పైగా కామం నెరవేరదు అనుకో వాడి తమ్ముడు కోపం కూడా వచ్చేస్తాడు. కోరిక నెరవేరక పోతే కోపం వచ్చేసి కామాన్ని రెచ్చగొట్టేస్తుంది. కామానికి సపోర్ట్ కోపం.

ఏ వస్తువుకి అయితే పుట్టుక తోటి చావుతోటి సంబంధం లేదో, ఏ వస్తువు అయితే స్వతంత్రంగా ఉంటుందో, ఏ వస్తువు అయితే అది ఉండటంవల్లే అది తెలియబడతూ ఉంటుందో అది చైతన్య వస్తువు. అది తెలుసుకుంటే నువ్వు సుఖి అవుతావు. అప్పటి వరకూ ప్రతీ జన్మలో ఏదో ఒక దుఖం, వెలితి నిన్ను వెంటాడుతూ ఉంటుంది. అశాంతి దుఖం నిన్ను విడిచిపెట్టదు. ఇప్పుడు మీకు దుఖం లేకపోతే బాగున్నాము అనుకుంటారు. దు:ఖం వాయిదా పడుతోంది అంతే. అణిగి ఉన్నప్పుడు మీకు లేదు అనిపిస్తుంది, కానీ అది ఉంది.

ఏదైతే సత్యమో, ఏదైతే నిత్యమో, దేనికైతే ద్వితీయం లేదో, ఏదైతే తనంతట తానుగా దేవుడి తోటి దేవతల తోటి సంబంధం లేకుండా, పంచభూతాలతోటి సూర్యచంద్రులతోటి సంబంధం లేకుండా రాత్రి పగలు తోటి సంబంధం లేకుండా ఏ వస్తువు అయితే స్వతంత్రంగా తనంతట తానుగా ఉందో, ఏది ఉండటం వల్ల మాత్రమే అది తెలియబడుతుందో అట్టి ప్రకాశములో అట్టి చైతన్యము లో మట్టుకు కామము లేదు, అక్కడ క్రోధము లేదు. అక్కడ అజ్ఞానము లేదు. అక్కడ బంధము లేదు. జీవుడా అక్కడికి మేలుకో! అప్పటివరకూ నువ్వు కామాన్ని జయించలేవు. ఆ చైతన్యము లోకి మేలుకో!

కొంతమంది ఇంట్లో వాళ్లకి బుద్ధి చెపుతూ ఉంటారు. నీ మనస్సుకి కూడా బుద్ధి చెప్పుకో. నీ మనస్సుకి చాపల్యం ఎక్కువ ఉంటుంది, అది తిరగటానికి అలవాటు పడిపోయింది. నీ మనస్సుని అరికట్టి ఒక చోట నిలబెట్టు. మనస్సుకి ఇంద్రియాలకి జత లేకుండా చూడు నువ్వు. అప్పుడు నీ మనస్సు నీ బుద్ధి చెప్పినట్టు వింటుంది. మనస్సు కంటే బుద్ధి పెద్దది. అంచేత నీ బుద్ధిని బాగుచేసుకొని, నీ బుద్ధితోటి నీ మనస్సుకి బుద్ధి చెప్పుకో. నీ బుద్ధి ఎప్పుడైతే నిదానంగా ఉందో, నీ బుద్ధి ఎప్పుడైతే పవిత్రం అయ్యిందో. నిర్మలం అయ్యిందో, నిశ్చలం అయ్యిందో, దానికంటే పైన ఉన్న పరమాత్మని అందుకునే స్థాయికి వచ్చేస్తుంది. నీ బుద్ధి వెళ్లి పరమాత్మలో ఐక్యం అయ్యిందా అక్కడ కామ క్రోధాలు లేవు. ఆ పరమాత్మని చేరుకొనే వరకూ నువ్వు కామక్రోధాలను జయించానని అనుకోవద్దు.

నీవు చేసే ప్రయత్నాలు అన్నీ నీకు ప్రబల శత్రువు అయిన కామాన్ని జయించటానికే నీ శక్తిని అంతా ఉపయోగించు. నీకు జీవితంలో ఒకడే శత్రువు ఉన్నాడు -- అది కామం! నువ్వు సజ్జనసాంగత్యం చేసినా, యాత్రలు చేసినా, పూజలు జపాలు చేసినా, హోలీ బుక్స్ చదివినా, శ్రవణం చేసినా, వాటి పర్పస్ ఒకటే, కామాన్ని జయించటం. ఈ కామ క్రోధాల రూపంలో మాయ ఉంది, వాటిని జయిస్తే నువ్వు మాయలోంచి బయటికి వచ్చేస్తావు. ఒక్క చైతన్యము లో మాత్రమే మాయ లేదు. అక్కడికి చేరుకొనే వరకూ ఒడ్డుకి వచ్చేసాము అనుకోకు, కామాన్ని జయించేసాను అనుకోకు. నిన్ను నువ్వు నమ్ముకోవటానికి వీలు లేదు. భగవంతుడిని పొందేవరకూ, పొందామని అనుకోవద్దు. ఎప్పుడైనా పతనం అయిపోయే అవకాశం ఉంది. అని కామం గురించి చాలా వివరంగా నాలుగు శ్లోకాలు ఖర్చు పెట్టాడు భగవంతుడు. దానిని జయించటానికి ఉపాయాలు చెప్పాడు.

మీరు అందరూ దుఃఖ స్పర్శలేని, అశాంతి స్పర్శలేని స్థితిని పొందాలి. మనకి ప్రారబ్ధం అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా శాంతిని నిర్మలత్వాన్ని మనం పోగొట్టుకోకూడదు. మనకి ఒక వేళ కష్టాలు వచ్చినా భగవంతుడు అనే వాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం సడలిపోకుండా, జారిపోకుండా చూసుకోవాలి. మనం ఎప్పుడూ విశ్వాస హీనులము అవ్వకూడదు.



**నీకు అదృష్టం వస్తే వికారం రాకూడదు. ఇతరులకు అదృష్టం వస్తే అసూయ రాకూడదు. ఇలా నీ మనస్సును సమానంగా ఉంచుకో. నీవు తరించటానికి అనేక సాధనలు ఉన్నాయి. అన్ని సాధనల కంటే సత్పురుషులతో సహవాసం కలిగి ఉండటమే గొప్ప సాధన, సత్సంగం గొప్ప సాధన. దాని వలన నీ మనస్సు నశిస్తుంది.**

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | |
|---|---|
| నవంబరు 10 | మ॥ గం॥ 2-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనము |
| నవంబరు 17 | మ॥ గం॥ 2-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనము |
| డిసెంబరు 10 | అరుణాచల జ్యోతి ఉత్సవము |

## ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174

For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502

**ది॥ 10-12-2019 జయవారం**

# అరుణాచల జ్యోతి ఉత్సవము

**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు**

| | | |
|---|---|---|
| ఉ॥ గం॥ | 6-00లకు | పారాయణ |
| | 7-00లకు | పూజా కార్యక్రమములు |
| | | భూసూక్త పారాయణ |
| | | దక్షిణామూర్తి స్తోత్ర పారాయణ |
| | | రుద్రాభిషేకము |
| | 11-00లకు | అన్న ప్రసాద వితరణ |
| మ॥గం॥ | 1-00లకు | భీమవరం సీతారామరాజు (రాము) |
| | | గారి ప్రవచనము |
| సా॥గం॥ | 5-00లకు | పూజా కార్యక్రమములు |
| | 6-00లకు | జ్యోతి ప్రజ్వలన |

**భక్తులందరికీ ఆత్మీయ ఆహ్వానము**

మీ చందాను స్వయముగా గానీ, లేదా శ్రీ రమణ క్షేత్రం, కార్పొరేషన్ బ్యాంక్ అకౌంట్ నెం. 520101264185724 (IFSC Code : CORP0001613) నందు గాని చెల్లించగలరు. చందాను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసినవారు జమ చేసిన తేదీ, వారి పూర్తి అడ్రసు 8883147999కు తెలియపరచగలరు.

# దైవిక ప్రేమలోనే మనిషి దేవుడు అవుతాడు

స్త్రీ పురుషలను కలిపేది ఆశ, కామం గాని ప్రేమకాదు. భార్య భర్తను, భర్త భ్యార్యను వాడుకొంటారు. పిల్లలు తల్లి దండ్రులను వాడుకొంటారు. వృద్ధులైన తరువాత పిల్లలను వాడుకొంటారు. దీన్నే మనం ప్రేమ అంటాము. మేధస్సుతో కుస్తీల వల్ల భయం పోదు. దైవ ప్రేమ వల్లనే భయం నుండి విముక్తి లభిస్తుంది. మన గుండె గదిలో ప్రేమ దీపం వెలిగించుకొంటే దేవుణ్ణి చూస్తాము. రామకృష్ణ పరమహంస గారు దేహం చాలించినా ఆయన సజీవంగా ఉన్నారనే విశ్వాసం వారి భక్తులకు ఉండేది. గురుదేవుల పటానికి ఉక్కబోస్తుందని రాత్రి పన్నెండు గంటల నుండి తెల్లవారే వరకూ విసనకర్రతో విసిరేవారు. అది ఎలా సాధ్యం అంటే ప్రేమకు ఆ శక్తి ఉంది అనేవారు. ఇతర భక్తులతో "స్వామి విశ్రమించే కాలం ఇది. గొడవ చెయ్యకండి స్వామి పరున్నారు అనేవారు. చిత్రపటం పట్ల వారికి అంత విశ్వాసం ఉండేది. గుడిలో దైవానికి కడిగి పుష్పాలు పెట్టినట్లే మన గురుదేవుల ఛాయాచిత్రాన్ని ఎప్పుడూ దుమ్ము తుడిచి పుష్పాలు పెట్టాలి. దుమ్ము గల గురుదేవ ఛాయాచిత్రాన్ని ఎప్పడూ ఉండచూకడదు. అది కూడా సాధనతో సమానం. రామకృష్ణుడు "భక్తుడికి భక్తి గొప్ప, జ్ఞానికి జ్ఞానం గొప్పది. ప్రారంభ దశలో ఇవి రెండూ భిన్నంగా అనుభూతమౌతాయి. ఆధ్యాత్మిక పూర్ణత నొందిన తరువాత ఆతనికి జ్ఞానమూ, భక్తీ ఒక్కటే అని గ్రహిస్తాడు" అన్నారు. మన భౌతికమైన ప్రేమలలో ఏమాత్రం ఔన్నత్యం లేదు, స్వార్థపూరితమైనది. ఇది జంతు ప్రేమలు. ఇవి మనలను ఉద్ధరించవు, దీనివల్ల మనకు వరిగేది బానిసత్వమే. ఆ ఎరుక మనకు కలగటం లేదు. ప్రేమ తాను ఇతరులకు ఏదేని ఇచ్చి ఆనందిస్తుంది. అహంకారం ఇతరుల నుంచి ఏదైనా తీసుకొని ఆనందిస్తుంది. దానికి తీసుకొనే భాష తెలుసు, ప్రేమకు ఇచ్చే భాష తెలుసుక ఇంతకంటే చెప్పటానికి ఏమీలేదు. నన్ను తిట్టాడు, నన్ను కొట్టాడు, నన్ను జయించాడు నన్ను వదిలేసాడు అని మదనపడేవానికి వైరం నశించదు. వైరం వైరం వల్ల నశించదు. ప్రేమించటం వల్లనే అది శమిస్తుంది. ఇదే సనాతన ధర్మం. సూర్యకిరణాలు విశ్వమంతా వ్యాపించి వున్నాయి. కాని దానిని ఒక భూతద్దంలో కేంద్రీకరించి ఒక బూరుగుదూదిని ఉంచితే దూది మండిపోతుంది. కేంద్రీకరణ వల్ల సూర్యరస్మికి అంత దహనశక్తి ఏర్పడుతుంది. అలాగే సర్వ వ్యాపకుడైన గురువును ప్రేమతో మన మనోశక్తిని అంతా ఆయన కళ్లపై కేంద్రీకరిస్తే మన మలిన సంస్కారాలు అన్నీ కాలిబూడిద అవుతాయి. ఇది శ్రీ నాన్నగారి అనుభవంతో తరచుగా చెప్పే ఆప్త వాక్యం. ఇది సాధనలో ఇంత తేలికైనది, ఇంత అభివృద్ధికి తోడ్పడేది ఏదీ లేదు అనేవారు. గురుదేవుల కల్యాణగుణాలను తలచుకొని ఆకళింపు చేసుకోవటం కూడా నిధి ధ్యాసే. మనం గురుదేవుల పరంజ్యోతిలో మనం నివసిస్తున్నపుడు పరంధామానికి వెళ్ళే దారి దానంతటఅదే దారి ఇస్తుంది. భక్తి వెలుగుతున్నప్పడు జ్ఞానం ప్రకాశిస్తున్నప్పడు ప్రతీ చిన్న విషయం కూడా సూర్యకాంతితో పద్మంలా వికసిస్తుంది అని అనుభవజ్ఞుల ఉవాచ.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**